క్లుప్తంగా

వైభవంగా కుంభాభిషేకం

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామంలో నిర్మించిన చెంచమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా హోమం నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి, గ్రామస్తులు ప్రశాంత్, గోపాల్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కొరిడి సర్పంచ్ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్టీసీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. మంగళంపాడు, ఉచ్చూరు ప్రాంతాలకు వెళ్లే బస్సులు సక్రమంగా నడవడం లేదన్నారు. స్పందించిన ఎంపీపీ దీనిపై దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



ఆంజనేయస్వామి కలశ మాల శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నాయుడుపేట టౌన్ : హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆంజనేయ స్వామి కలశ మాల శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా స్వర్ణముఖి నది నీటిని కలశాల్లో నింపుకుని ఊరేగింపుగా అగ్రహారపేటలో వున్న ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ నీటితో గురువారం ఉదయం స్వామికి అభిషేకం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవంతో హనుమజ్జయంతి వేడుకలు ముగుస్తాయన్నారు. శోభాయాత్ర కార్యక్రమంలో సుంకు వెంకట సుబ్బారావు సోదరులు, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సాయిక్రిష్ణారెడ్డిని పరామర్శిస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కోట: మండలంలోని దొరువుకట్టకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వూరు సాయి క్రిష్ణారెడ్డి ఇటీవల ఇంట్లో జారి కింద పడడంతో కాలు విరిగింది. చికిత్స చేసుకుని ఇంట్లో వున్నారు. ఈవిషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పాదర్తి రాధాక్రిష్ణారెడ్డి ఉన్నారు.

వీఆర్‌ఓల నిరసన

సూళ్లూరుపేట రూరల్: రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వం తీసుకువచ్చిన క్లస్టర్ విధానంపై వీఆర్‌ఓలు బుధవారం సూళ్లూరుపేట ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వీఆర్‌ఓల సంఘం డివిజన్ గౌరవాధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్-4ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఓలు మనోజ్‌కుమార్, ఎస్.భార్గవ్, భాస్కర్, కరణం బాబు పాల్గొన్నారు.

'కష్టపడిన వారికి పార్టీ అండ'



మినీ మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

నాయుడుపేట టౌన్: కష్టపడి పనిచేసిన వారికి టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నియోజవర్గ స్థాయి మినీ మహానాడు నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ మినీ మహానాడులో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళతామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, శిరసనం బేటి విజయభాస్కర్ రెడ్డి, నెలవల రాజేష్, సన్నా రెడ్డి చంద్రారెడ్డి, తిరుమూరు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం



చిట్టమూరు: మండల కేంద్రమైన చిట్టమూరులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. దీన్ని గత ప్రభుత్వంలో రూ.10 లక్షలు వెచ్చించి వ్యవసాయ శాఖ కార్యాలయం కోసమని నిర్మించారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు నిర్మించడంతో అక్కడి నుంచే వ్యవసాయ శాఖ అధికారులు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖలకు ప్రత్యేక కార్యాలయాలు లేవు. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని కార్యాలయానికి వినియోగించుకునే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం భవనం చుట్టూ కంప చెట్లు మొలిచి అధ్వానంగా కనిపిస్తోంది.

పొంచి ఉన్న ప్రమాదం



దొరవారిసత్రం: మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న దాబాల నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాలతో ప్రమాదం పొంచి వుందని స్థానికులు వాపోతున్నారు. అవి రోడ్డుపైకి వచ్చే సమయంలో చక్రాలకు పెద్ద ఎత్తున బురద అంటుకుని రోడ్డు పడిపోతోంది. దీనివల్ల ద్విచక్ర వాహనాలు జారి పడిపోయి వాహనదారులు గాయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు రోడ్డుపై మట్టి ఉన్న విషయం గుర్తించలేకపోతుండడంతో వాహనాలు జారి కింద పడుతున్నాయి. అదే సమయంలో ఏదైనా పెద్ద వాహనం వస్తే నష్టం పెద్ద ఎత్తున కలుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల మావిళ్లపాడు, కుప్పారెడ్డిపాళెం, డీవీ సత్రం తదితర ప్రాంతాల్లో రహదారి వెంబడి ఉన్న డాబా హోటళ్లకు వచ్చి వెళ్లే వాహనాల ద్వారా అధిక మొత్తంలో బురద రోడ్డుపైకి చేరుతోంది. రోడ్డు నిర్వహణ సంస్థ బురద మట్టి, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మూలన పడిన 108 వాహనం



పెళ్లకూరు: పెళ్లకూరు మండలానికి చెందిన 108 వాహనం మరమ్మతులకు గురైంది. స్థానిక పీహెచ్‌సీలో పది నెలలుగా మూలనపడింది. నాయుడుపేట, పూతలపట్టు జాతీయ రహదారిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెళ్లకూరు పీహెచ్‌సీకి రెండు 108 వాహనాలను మంజూరు చేసింది. పది నెలలుగా 108 వాహనం మరమ్మతులకు గురై మూలన పడినా అధికారులు పట్టించుకోలేదు. అత్యవసర సమయాల్లో శ్రీకాళహస్తి, నాయుడుపేట నుంచి వాహనం రావాల్సి వస్తోంది. సరైన సమయానికి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించకపోతుండడంతో మృత్యువాత పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి 108 వాహనానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఉపాధిలో యథేచ్ఛగా అక్రమాలు



మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు

కలువాయి మండలంలో ఉపాధి పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీ ఉద్యోగులు, ఇతరులకు జాబ్‌కార్డులు మంజూరు చేస్తున్నారు. పనులు చేయకపోయినా మస్టర్లలో హాజరు నమోదు చేస్తున్నారు. వేర్వేరుచోట్ల పనులు చేసినట్టు రికార్డుల్లో చూపించి నిధులు స్వాహా చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- ఐటీ ఉద్యోగికి జాబ్‌కార్డు
- మస్టర్లలో ఇతరుల పేర్లు
- పనులు చేయకపోయినా హాజరు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని తెలుగురాయపురం గ్రామంలో 645 కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు మంజూరయ్యాయి. వాటిలో ఎస్టీలు 80 కుటుంబాలు, ఎస్సీలు 183, బీసీ ఇతరులు 382 కుటుంబాలు ఉన్నాయి. ఆ గ్రామంలోనే తురక రాజమ్మ అనే మహిళకు 10181 నంబర్‌తో జాబ్‌కార్డు మంజూరైంది. అందులోనే ఐటీ ఉద్యోగి ప్రతాప్ పేరును చేర్చి ఉపాధి హామీ పనులు చేస్తున్నట్టు చూపి నిధులు డ్రా చేసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన అల్లంపాటి ఇందిరమ్మ పేరుతో 10462 నంబర్ జాబ్‌కార్డు ఉంది. అందులో ఐటీ ఉద్యోగితో పాటు ఇన్‌కమ్ ట్యాక్స్ కడుతున్న శ్రీహరి పేరును చేర్చారు. అంతేగాక దూర ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థుల పేర్లను జాబ్‌కార్డుల్లో చేర్చారు. వారు పనులు చేయకపోయినా చేస్తున్నట్టు మస్టర్లలో నమోదు చేస్తున్నారు. అలాగే రాపూరు రత్నమ్మ పేరు మీద ఉన్న 10265 నంబర్ జాబ్‌కార్డులో 65 ఏళ్ల వృద్ధురాలు ఆదెమ్మ పేరును చేర్చి బినామీ మస్టర్లతో వేతనాలు మంజూరు చేసుకుంటున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డుల్లో ఇతర పేర్లను చేర్చి నిధులను కాజేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏపీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



Telugurayapuram
TELUGURAYAPURAM
Kaluvoya
NELLORE(ANDHRA PRADESH)
India Post Payments Bank

జాబ్‌కార్డులో ఉన్న ఐటీ ఉద్యోగి పేరు

తిరువణ్ణామలైకి ఆర్టీసీ బస్సు

రాపూరు: తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేసినట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. ఈ బస్సు 10వ తేదీ ఉదయం 9 గంటలకు పొదలకూరులో బయలుదేరి రాపూరు, డక్కిలి, వెంకటగిరి, తిరుపతి, చిత్తూరు, వేలూరు మీదుగా సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. రానుపోను టిక్కెట్ ధర రూ.1300లని, ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు.

హిందూ ధర్మాన్ని ఆచరించాలి

చిల్లకూరు: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని ఆచరించాలని వీహెచ్‌పీ జిల్లా నాయకుడు మురళీరెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని విజయదుర్గాదేవి అమ్మవారి ఉప పీఠంలో బుధవారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని కోట సునీల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో రూపొందించిన ఆడియో క్యాసెట్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతను పెంపొందించేలా వారంలో ఒక రోజు ఉప పీఠంలో గడిపేలా ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోట ప్రకాశం, చంద్రసీల్, మనోజ్‌కుమార్, మల్లికార్జున్, జనార్ధన్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో ఖాళీలను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాఘవయ్య

చిల్లకూరు: సౌత్ సెంట్రల్ రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆలిండియా జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. గూడూరులోని రైల్వే ఫంక్షన్ హాల్‌లో బుధవారం రైల్వే కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల సౌత్ సెంట్రల్ రైల్వేలో స్టేషన్లు నిర్మించడం, కొత్త రైలే మార్గాలు ఏర్పాటుచేయడంతో కార్మికులు, ఉద్యోగులపై పని భారం పెరిగిందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే పాత పెన్షన్ విధానాన్ని తీసుకుని వచ్చేలా రైల్వే శాఖ అధికారులను కోరతామన్నారు. కార్యక్రమంలో నాగేంద్రబాబు, ఆమంచి వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణం కాలేజీ మిట్టలో బుధవారం పోలేరమ్మ కొలుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

తాగునీటి బోర్లు, మోటార్ల పరిశీలన



ఆర్టీసీ బస్టాండు వద్ద పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే సత్వరం పరిష్కరించాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం తాగునీటి సరఫరా విభాగానికి చెందిన మెకానిక్కులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పట్టణంతోపాటు మున్సిపాలిటీలో విలీనమైన జువ్వలపాళెం, విన్నమాల, బిరదవాడ, శ్రీనివాసపురం, బట్టివిడత కాలనీ తదితర ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. స్వర్ణముఖి నదితోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న తాగునీటి మోటార్లు, బోర్లను ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. బస్టాండులో పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

జాబ్ మేళాలో 180 మందికి ఉద్యోగాలు



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న హెచ్‌ఆర్‌లు

చిల్లకూరు: గూడూరు రెండవ పట్టణంలోని ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 180 మందికి ఉద్యోగాలు పొందినట్టు ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేలా పారిశ్రామిక శిక్షణశాఖ, ఉపాధి కల్పన శాఖ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించినట్టు తెలిపారు. మేనకూరు సెజ్‌లోని అరబిందో, గూడూరులోని నెల్‌క్యాస్ట్, కై సర్ ప్రొడక్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ క్రమంలో సుమారు 180 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

కలువాయి సర్వేయర్ మృతి



హజరత్తయ్య

కలువాయి(సైదాపురం): కలువాయి మండల సర్వేయర్ షేక్ హజరత్తయ్య (52) గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మంగళవారం కార్యాలయం నుంచి ఏఎస్‌పేటలోని ఇంటికి వెళుతుండగా గుండెపోటు వచ్చింది. ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందారు. ఆయన స్వగ్రామ సైదాపురం మండలంలోని కలిచేడులో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు నెల్లూరు జిల్లా సర్వేయర్ వై.నాగేశ్వరావు రూ.25 వేలు అందజేశారు. ఆయన మృతికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని పలుప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య తెలిపారు. వారు బుధవారం పిండిపాళెం వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, తల్లంపాడు కస్పారెడ్డిపాళెంలో నీటి బోరును పరిశీలించారు. చెంగాళమ్మ ఆలయం సమీపంలో శ్రీనగర్ కాలనీలో పర్యటించారు. శ్రీనగర్ కాలనీలో బోర్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. వాటర్ క్యాన్లు విక్రయించేవారు అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదు మేరకు వ్యాపారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సౌకర్యం లేనిచోట ట్యాంకర్లతో నీటిని అందిస్తామని తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో వున్న ప్రభుత్వ భూములను బుధవారం తహసీల్దార్ రామయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నౌకల నిర్మాణ కేంద్రం ఏర్పాటు కానున్న నేపథ్యంలో 2,700 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఇక్కడ ప్రస్తుతం 400 ఎకరాలు ప్రభుత్వ భూములు, మరో 400 ఎకరాలు డీకేటీ భూములు ఉన్నాయని తెలిపారు. మిగిలిన భూముల కోసం ప్రైవేట్ భూములు సేకరించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా తీరంలోని రొయ్య పిల్లల హేచరీలను పరిశీలించారు. అవి ఎన్ని మూతపడ్డాయి, ఎన్ని పనిచేస్తున్నాయి తదితరాలపై ఆరా తీశారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

చిట్టమూరు: మండలంలోని ఆరూరు పంచాయతీ రాఘవవారిపాళెంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో నిర్మించిన హనుమంతుని భారీ విగ్రహం వద్ద ఉదయం గణపతి పూజతో వేడుకలు ప్రారంభిస్తామని వెల్లడించారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామని తెలిపారు.

నేడు శోభాయాత్ర

వెంకటగిరి రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా వెంకటగిరిలో గురువారం సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు నర్రా రవి, పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్, కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి కాశీవిశ్వనాథ స్వామి ఆలయం వరకు యాత్ర సాగుతుందని తెలిపారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

ఓజిలి: మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా విద్య, వైద్య, వ్యవసాయ, ట్రాన్స్‌కో, అంగన్‌వాడీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చేతిబోర్లు, పైపులైన్లు మరమ్మతులకు గురై తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని, నీడ కోసం టార్పాలిన్ పట్టలు ఏర్పాటుచేయాలన్నారు. ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలను తరలించి వర్మీకంపోస్టు తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రవీంద్రబాబు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు

చిల్లకూరు: ఉపాధి హామీ కింద చేపట్టిన పశువుల నీటి తొట్టెలు, ఇంకుడు గుంతల పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని ఏపీడీ వరప్రసాద్‌రావు హెచ్చరించారు. ఆయన బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో చేపట్టిన పశువుల నీటి తొట్టెల పనులను పరిశీలించి నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. పాడి రైతుల కోసం నిర్మిస్తున్న పశువుల షెడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న అందరికీ పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో గిరి బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నాగబాబు

వాకాడు: వాకాడులోని స్వర్ణముఖి నది పక్కనున్న ఒక ఇంట్లో ఏప్రిల్ 27న చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. వాకాడులోని స్వర్ణముఖి నది పక్కనున్న ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కొండూరుపాళెంకు చెందిన చిరు అలియాస్ చిరంజీవి, నెల్లూరు నుంచి వచ్చి కోటలోని కోటమ్మ గుడి వద్ద కాపురం ఉంటున్న శ్రీనును అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి 10 బంగారు ముక్కు పుడకలు, ఒక వెండి గ్లాసు, ఒక కుంకుమ భరిణి, రెండు ఖరీదైన సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకునట్టు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిపారు.

బైక్ చోరీపై విచారణ

కోట: స్థానిక ప్రగతి కళాశాల రోడ్డులో నివాసం ఉంటున్న రవీంద్ర తన ఇంటి ముందు ఉంచిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి బుధవారం దర్యాప్తు చేపట్టారు. అర్ధరాత్రి ఇంటి ముందు తిరుగుతూ వాహనాన్ని చోరీ చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని పట్టుకుంటామని పేర్కొన్నారు.

పరిహారం చెల్లించకుంటే ఆందోళనలు ఉద్ధృతం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నాయుడుపేట టౌన్: సాగరమాల రోడ్డుకు తీసుకున్న భూములకు పరిహారం వెంటనే ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరించారు. వారు బుధవారం తహసీల్దార్ మాగర్ల రాజేంద్రకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న సర్వే నంబర్లు 3, 4, 56, 11, 12, 15లలో 36 మంది రైతుల భూములను ప్రభుత్వం మూడేళ్ల క్రితం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సుమారు రూ.15 కోట్లకు పైగా పరిహారం ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడంతో కుటుంబాల పోషణ కష్టంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా పరిహారం చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు భూములను పరిశీలించారని, త్వరలోనే పరిహారం అందజేస్తామని వెల్లడించారు. ఇందుకు అవార్డు సైతం ప్రకటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు కోండూరు రామకృష్ణంరాజు, తంబిరెడ్డి సరోజనమ్మ, ఎం.అనసూయమ్మ, ఎం.బాలకృష్ణయ్య, ఎం. కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం



సైదాపురంలో కురుస్తున్న వర్షం

సైదాపురం/దొరవారిసత్రం/చిట్టమూరు: సైదాపురం, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ కాసింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా అడపాదడపా వర్షం కురుస్తుండడంతో వాతావరణం కొంత చల్లబడింది. ఈ వర్షం ఎడగారు కింద సాగవుతున్న వరి పంటతోపాటు నిమ్మ, మామిడి పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో దొరవారిసత్రం మండలంలోని తనియాలి, బూదూరు, వెదురుపట్టు, వేముంబాకం, లింగంపాడు, బురదమడుగు, వేటగిరిపాళెం తదితర గ్రామాల్లో కొంతమంది రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మరికొంతమంది నాట్లు వేయడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. చిట్టమూరు మండలంలోని అరవపాళెం, బయ్యావారికండ్రిగ, తాడిమేడు, ఎల్లసిరి, గునపాడు, మెట్టు, ఈశ్వరవాక, గునపాటిపాళెం గ్రామాల్లో రైతులు ఎడగారు వరి సాగు చేస్తున్నారు.



చిట్టమూరు వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు



దొరవారిసత్రం:తనియాలిలో వరి నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు